క్లుప్తంగా

ఆర్థిక సాయం

టేకులపల్లి: లచ్చా తండా గ్రామానికి చెందిన బానోతు మంగీలాల్ (36) ఇరవై ఏళ్లుగా ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాలలో సీఆర్‌టీగా పని చేస్తున్నాడు. క్యాన్సర్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఈనెల 14న ఇంటి వద్దనే మృతి చెందాడు. ఈ మేరకు ఆదివారం జరిగిన మంగీలాల్ పెద్దకర్మ కార్యక్రమంలో తనతో 2000లో పదో తరగతి చదువుకున్న స్నేహితులు భార్య మానసకు రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు.

పాల్వంచ: అశ్వారావుపేట మండలం నందిపాడు గ్రామానికి చెందిన సొలం కాంతారావు క్యాన్సర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఇతనికి పాల్వంచకు చెందిన జనహిత ఫౌండేషన్ సంస్థ అధ్యక్షురాలు శ్రీలక్ష్మి ఆదివారం అతని ఇంటికి వెళ్లి రూ.10వేలు అందించారు.

ఇల్లెందురూరల్: మామిడిగూడెం గ్రామానికి చెందిన కల్తి కిషోర్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవల హైదరాబాద్‌లో శస్త్రచికిత్స చేయించారు. విషయం తెలుసుకున్న ఆదివాసీ హెల్ప్‌లైన్ ప్రతినిధులు రూ.10వేలను కిషోర్ కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు.

నేడు ఒలింపిక్ డే రన్

కొత్తగూడెంటౌన్: ఒలింపిక్ డే రన్‌లో ప్రతీఒక్కరు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఎం.పరంధామరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. సోమవారం తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్, జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో ఒలింపిక్ డే రన్‌ను కొత్తగూడెం రైల్వే స్టేషన్ వద్ద ప్రారంభించి ప్రకాశం స్టేడియంలో ముగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఉదయం 6 గంటలకు కలెక్టర్, ఎమ్మెల్యే కూనంనేని పాల్గొని ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

ఘనంగా బోనాలు


బోనాలతో వస్తున్న మహిళలు

టేకులపల్లి: టేకులపల్లి మండలం కొత్తతండా(జి) గ్రామంలో ఆదివారం బోనాల పండుగ ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలో మహిళలు, బాలికలు, యువతులు బోనాలతో ఊరేగింపుగా బయలుదేరి పూనకాలు, నృత్యాలతో గ్రామదేవతలను దర్శించుకుని ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

ఇల్లెందురూరల్: పోచారంతండా గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వేట వేంకటేశ్వర స్వామి కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. పచ్చటి తోరణాలు, పదకవిత పితామహుడు అన్నమయ్య సంకీర్తనలతో వేట వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం సందడిగా సాగింది. స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు సమృద్ధిగా పండాలని స్వామివారిని వేడుకున్నారు.

మారిన విద్యుత్‌శాఖ అధికారుల ఫోన్ నంబర్లు

జూలూరుపాడు: జూలూరుపాడు, పాపకొల్లు (అన్నారుపాడు), పడమటనర్సాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ల అధికారుల మారిన ఫోన్ నంబర్లు.

సుజాతనగర్ ఏడీఈ	8712485895
జూలూరుపాడు ఏఈ	8712485902
సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్	8712485903
లైన్ ఇన్‌స్పెక్టర్	8712485904
లైన్ ఇన్‌స్పెక్టర్, పడమటనర్సాపురం	8712485905
లైన్‌మెన్, జూలూరుపాడు	8712485906
జూలూరుపాడు విద్యుత్ స్టేషన్	8712485907
పడమటనర్సాపురం సబ్‌స్టేషన్	8712485908
పాపకొల్లు(అన్నారుపాడు) సబ్‌స్టేషన్	8712485909


బ్యాగును పరిశీలిస్తున్న దృశ్యం


పుస్తకాల షాపులో రద్దీ


రెడీమేడ్ యూనిఫామ్ దుకాణం

మార్కెట్‌లో కొనుగోళ్ల సందడి

- బ్యాగ్‌లు, బుక్ షాపుల్లో విద్యార్థులతో రద్దీ
- వస్త్ర దుకాణాలలో యూనిఫామ్ అమ్మకాలు
- గత ఏడాదితో పోలిస్తే పెరిగిన ధరలు

కొత్తగూడెంఅర్బన్: 2025–26 నూతన విద్యా సంవత్సరం ఈ నెల 12వ తేదీ నుంచి మొదలైనప్పటికీ కొత్తగూడెం మార్కెట్‌లో విద్యార్థుల కొనుగోళ్ల సందడి ఇంకా కొనసాగుతోంది. పేద, మధ్య తరగతి తల్లిదండ్రులు డబ్బులు సమకూర్చుకొని పిల్లలను స్కూళ్లకు పంపించేందుకు పలు వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో స్కూల్ మారినవారు అడ్మిషన్లు తీసుకోవడం వంటివి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఇంకా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో కొత్తగా అడ్మిషన్లు తీసుకున్న వారు మార్కెట్‌కు వచ్చి కొనుగోలు చేస్తుండడంతో షాపులలో రద్దీ కనిపిస్తోంది. కొత్తగూడెంలోని రామవరం మొదలుకొని పోస్టాఫీసు సెంటర్, బస్టాండ్ సెంటర్, సూపర్‌బజార్, చిన్నబజార్, లక్ష్మీదేవిపల్లిలో ఎక్కువగా బుక్ షాపులున్నాయి. ఆయా షాపుల దగ్గరకు తల్లిదండ్రులు వారి పిల్లలను వెంట తీసుకొని వెళ్లి నోట్‌బుక్స్, పెన్నులు, జామెట్రీ బాక్స్‌లతో పాటుగా తరగతి గదులో వారు విద్యబుద్ధులు నేర్చుకోవడానికి అవసరమైన వాటిని కొనుగోలు చేస్తున్నారు. నోట్‌బుక్స్‌కు సంబంధించి వందపేజీలు, ఆపైన పేజీలున్న బుక్స్‌కు ఒక్కొక్క దానికి గత ఏడాది కంటే రూ.5 నుంచి రూ.10 వరకు రేట్లు పెంచి అమ్మకాలు చేస్తున్నరని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల వారు, వారి పాఠశాలలోనే నోట్‌బుక్స్‌తో పాటుగా పాఠ్యపుస్తకాలు కూడా అమ్ముతున్నారు. బయట ఎక్కడైనా బుక్‌షాపులలో కొనుగోలు చేస్తే ఆ విద్యార్థులను పాఠశాలకు అనుమతించరు. దీంతో చేసేది ఏమీలేక విద్యార్థుల తల్లిదండ్రులు అక్కడే కొనుగోలు చేస్తున్నారు. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు మాత్రమే బుక్స్ షాపులలో నోట్‌బుక్స్ ఇతర సామగ్రిని కొనుగోలు చేస్తున్నారు.


బ్యాగులు కొంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఆకర్షించే స్కూల్ బ్యాగ్‌లు..

విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే కొత్తగూడెంలోని వివిధ షాపుల వారు స్కూల్ బ్యాగులను హైదరాబాద్, విజయవాడ, ఢిల్లీ వంటి ప్రాంతాల నుంచి ముందస్తుగా తెప్పించి అమ్మకాలు చేస్తున్నారు. స్కూల్ బ్యాగులు అయితే ప్రతీ సంవత్సరం కొనుగోలు చేయాల్సిన అవసరం పడుతుందని తల్లిదండ్రులు చెబుతున్నారు. సంవత్సరం కూడా బ్యాగును స్కూల్స్‌కు తీసుకెళ్లి పిల్లలు ఇష్టానుసారంగా వాడడం వలన ఒక సంవత్సరానికి మించి ఆ బ్యాగు ఉండదని చెబుతున్నారు. అయితే ఒక స్కూల్ బ్యాగు రూ.200 నుంచి రూ.1000 వరకు అమ్మకాలు చేస్తున్నారు వ్యాపారులు. సాధారణ స్కూల్ బ్యాగులతో పాటుగా ఫ్యాన్సీ బ్యాగులను కూడా అమ్ముతున్నారు. బుక్స్‌షాపులతో పాటుగా కొత్తగూడెంలో స్కూల్ యూనిఫామ్‌లు అమ్మే షాపుల సంఖ్య కూడా పెరిగింది.

వస్త్ర దుకాణాలలో యూనిఫామ్..

కొత్తగూడెంలోని వస్త్ర దుకాణాలలో యూనిఫామ్ సందడి నెలకొంది. కొన్ని ప్రైవేటు పాఠశాలలు వస్త్ర దుకాణాలకు యూనిఫామ్ అప్పగించారు. దీంతో పాఠశాలల్లో అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులకు యూనిఫామ్‌ను ఆయా షాపుల్లో కొనుగోలు చేయాలని ముందస్తుగా సూచనలు చేస్తున్నారు. దీంతో వస్త్ర దుకాణాలలో రద్దీ ఉంటోంది. దీంతో పాటుగా అన్నీ స్కూళ్ల యూనిఫామ్‌ను రెడీమెడ్‌గా కూడా అమ్మకాలు చేస్తున్నారు.

ధరలు నియంత్రించాలి...



స్కూళ్లతో పాటుగా మార్కెట్‌లో యూనిఫాం, బ్యాగులు, బుక్స్ అన్నింటికీ గత ఏడాదితో పోలిస్తే ధరలు పెరిగాయి. పెరిగిన రేట్లపై విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలి. పేద, మధ్య తరగతి వారు పెరిగిన రేట్లకు కొనుగోలు చేయలేక, ఫీజులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు.

– ఈ.రవీందర్, కొత్తగూడెం

నెలాఖరు వరకు అమ్మకాలు



ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి బ్యాగుల అమ్మకాలు నెలాఖరి వరకు కొనసాగుతాయి. గత ఏడాదితో పోలిస్తే రేట్లు మార్పులు లేవు. తక్కువ ధరలకే అమ్మకాలు చేస్తున్నాం. రూ.200 నుంచి రూ.1000 వరకు సాధారణ బ్యాగులతో పాటుగా ఫ్యాన్సీ బ్యాగులు కూడా అమ్ముతున్నాం.

– ఎస్.వెంకటరావు, వ్యాపారి

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న నాగేశ్వరరావు

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పెండింగ్‌లో ఉన్న క్లైయిమ్స్ విడుదల చేయాలని, భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర నాయకులు గొని నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం రైటర్‌బస్తీలోని ఇఫ్టూ కార్యాలయంలో తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం జిల్లా అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు వద్ద రూ.6000 కోట్లు ఉన్నాయని వాటిని కార్మికులకు ఖర్చు పెట్టకుండా ప్రైవేట్ వ్యక్తులు ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. కనీసం కరోనా సమయంలో కార్మికుల సంక్షేమానికి ఉపయోగించలేదన్నారు. ప్రభుత్వం వసూలు చేసే సెస్ నిధులు కార్మికులకు అందేలా లేవరన్నారు. తక్షణమే భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా యర్రం శ్రీను, కార్యదర్శిగా రావూరి ఉపేందర్‌రావులతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.సంజీవ్, వి.సురేష్‌కుమార్, పావురాల లాలయ్య, చల్లా నర్సింహారావు, వెంకన్న, కొమరం మల్లేష్, రామ్మూర్తి, సతీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ కమిటీ ఎన్నిక

జూలూరుపాడు: జూలూరుపాడు యల్లంకి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో శనివారం జరిగిన సీపీఐ 13వ మండల మహాసభలో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ప్రస్తుతం సీపీఐ మండల కార్యదర్శిగా కొనసాగుతున్న గుండెపిన్ని వెంకటేశ్వర్లు తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శిగా ఎస్కే నాగుల్ మీరా, వీరితో పాటు మరో 25 మంది కార్యవర్గ సభ్యులు, 71 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు.

ఆదివారం జూలూరుపాడులో నూతన కార్యవర్గ సమావేశం జరిగింది. వెంకటేశ్వర్లు, నాగుల్‌మీరా మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని, ఎల్లప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సిరిపురపు వెంకటేశ్వర్లు, పొన్నెకంటి వెంకటేశ్వర్లు, యాసా రోశయ్య, గుండెపిన్ని మధుసూదన్‌రావు, వల్లమల్ల సామేలు, చిమట ముత్తయ్య, కంచర్ల రాఘవేంద్రరావు, ఎస్కే చాంద్‌పాషా పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయండి..


మాట్లాడుతున్న కామేష్

కొత్తగూడెంఅర్బన్: విద్యాహక్కు చట్టం 2009 అమలు చేయాలని జైభీమ్‌రావ్ భారత్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యర్రా కామేష్ డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రకారం దేశంలోని 6 నుంచి 14 సంవత్సరాల వయస్సున్న పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్యను అందించాల్సి ఉండగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు ప్రైవేటు విద్యాసంస్థలలో 25 శాతం రిజర్వేషన్ కల్పించాలని, 2009లో చట్టం చేసినా విద్యా హక్కు చట్టాన్ని ప్రైవేట్ పాఠశాలలు అమలు చేయడం లేదని ఆరోపించారు. పాలకులే పాఠశాలలు, కళాశాలలు నిర్వహిస్తూ ఉండటం చేత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఇది సరైంది కాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగానికి అరకొర నిధులు కేటాయిండడం మూలంగా విద్యారంగం సంక్షోభంలో పడి అట్టడుగువర్గాల విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. విద్యాహక్కు చట్టం 2009 అమలు కొరకు దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జునరావు, అసెంబ్లీ అధ్యక్షుడు నాగుల రవికుమార్, వంగా రవిశంకర్, పూణెం మురళి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు


విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేస్తున్న దృశ్యం

ఇల్లెందు: ఇల్లెందులో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. చీఫ్ గెస్ట్ తోట శ్యామ్ ప్రసాద్, పెండ్యాల రోజా లక్ష్మి పాల్గొన్నారు. ఆదివారం ఇల్లెందులో ఒకేరోజు పది కార్యక్రమాలు చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. రీజినల్ చైర్ పర్సన్ సీమకుర్తి రాజమనోహర్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో శ్రీ హరిహర క్షేత్రంలో వాసవీమాతకు ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు.

గోశాలలో గరుకు స్తంభం వేసి అభిషేకం చేశారు. గోదానం చేసి ఆలయ ప్రాంగణంలో జవాను వంశీరెడ్డి, రైతు కృష్ణను సన్మానించారు. విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు రవికిరణ్, సత్యేంత్ర ప్రసాద్, తీర్థాల నాగరాజు, ఎలుగూరి నగేష్‌కుమార్, మండల అధ్యక్షుడు ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, అనుబాబు, తాటిపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ఇల్లెందురూరల్: ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా పలు గ్రామపంచాయతీలలో ఇళ్ల నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య శంకుస్థాపన చేయనున్నట్లు కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు పులి సైదులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు బొజ్జాయిగూడెం, 7:30కు సుదిమళ్ల, 8 గంటలకు బాలాజీనగర్, 8:30 గంటలకు సుభాష్‌నగర్, 9 గంటలకు ఇందిరానగర్‌లో శంకుస్థాపన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఆయా గ్రామపంచాయతీల పరిధిలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సకాలంలో కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

ప్రజా సమస్యలపైనే పోరాటాలు


మాట్లాడుతున్న రామ్‌చందర్

టేకులపల్లి: అధికారం ఉన్నా లేకున్నా కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పేద పక్షాన పోరాటాలు చేస్తుందని ఆ పార్టీ టేకులపల్లి మండల కార్యదర్శి గుగులోత్ రామ్‌చందర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలో జరిగిన టేకులపల్లి, సులానగర్, సింగరేణి కాలనీ గ్రామశాఖల మహాసభల్లో ఆయన మాట్లాడారు. సీపీఐలో కార్మికులు, కర్షకులు, పేద, బడుగు బలహీన వర్గాలు ఉన్నారని, వారి హక్కుల సాధన, సమస్యల పరిష్కారం పోరాటాలు కొనసాగుతూనే ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం గ్రామశాఖల నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టేకులపల్లి గ్రామశాఖ కార్యదర్శిగా అయిత శ్రీరాములు, సహాయ కార్యదర్శిగా తేజావత్ మధు, సతీష్, సులానగర్ గ్రామశాఖ కార్యదర్శిగా కీర్లపూడి సుందర్ పాల్, సహాయ కార్యదర్శిగా గోసు ఆనంద్‌రావు, సింగరేణి కాలనీ శాఖ కార్యదర్శిగా తేజావత్ లక్ష్మణ్, సహాయ కార్యదర్శిగా జ్యోతిని ఎన్నుకున్నారు.

ఓసీలో పర్యటన


ఓపెన్‌కాస్టును పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు

టేకులపల్లి: సింగరేణి (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) డైరెక్టర్ కే.వెంకటేశ్వర్లు ఆదివారం కోయగూడెం ఓపెన్ కాస్టులో పర్యటించారు. పని స్థలాలను సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. రోజువారి బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబీ బ్లాస్టింగ్, లోడింగ్ పనులను జీఎం వి.కృష్ణయ్యను అడిగి తెలుసుకున్నారు. డైరెక్టర్ మాట్లాడుతూ... వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యల గురించి అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. బొగ్గు ఉత్పత్తి, రవాణా రోజు వారి లక్ష్యాలను అధిగమించి రవాణాకు ఎటువంటి ఆటంకములు లేకుండా ముందస్తు జాగ్రతలు తీసుకోవాలని, అలాగే బొగ్గు నాణ్యత సామర్థ్యం పెంచి జీ13 బొగ్గు ఉత్పత్తి అయ్యేవిధంగా చూడాలని సూచించారు. ఉపరితల గనుల్లో ఉద్యోగులకు రక్షణ పరమైన జాగ్రత్తలు, రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి తీయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోయగూడెం పీఓ గోవింద రావు, మేనేజర్ శ్రీనివాస్, క్వాలిటీ మేనేజర్ రాందాస్, ఏరియా సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులు మత్తు పదార్థులు, డ్రగ్ వంటి వాటికి దూరంగా ఉండాలని టూటౌన్ ఎస్సై ఖాన్ అన్నారు. రామవరంలోని ఎస్టీ హాస్టల్‌లో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డ్రగ్స్, మహిళా రక్షణ అనే అంశాలపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ఖాన్ మాట్లాడుతూ... డ్రగ్స్ వలన కలిగే నష్టాలను వివరించారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరుచుకుని వాటి సాధనకు కష్టపడి చదవాలని సూచించారు. పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ

జూలూరుపాడు: ఈనెల 24న జూలూరుపాడు ఆర్య వైశ్య కల్యాణ మండపంలో జరిగే కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి లబ్ధిదారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

విత్తనాలతో మోసపోతున్న అన్నదాతలు

- నకిలీ విత్తనాలు, పురుగు మందులతో జాగ్రత్త
- గుర్తింపు పొందిన దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి
- రైతులకు వ్యవసాయాధికారుల సూచన


నాయకులగూడెంలో పురుగుమందుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)


సుజాతనగర్‌లో పత్తి గింజలు వేస్తున్న మహిళలు

సుజాతనగర్: వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌లో గుర్తింపు లేని విత్తనాలు పుట్టగొడుగుల్లా వస్తున్న తరుణంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు చెబుతున్నారు. నకిలీలను అరికట్టేందుకు విత్తన ప్యాకెట్లపై ప్రభుత్వ నిబంధనల ప్రకారం పొందుపర్చిన వివరాలను సరిచూసుకొని కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు.

అధికారుల సూచనలు...

జూన్ మొదటి వారంలోనే కురిసిన వర్షాలతో రైతులు కోటి ఆశలతో సాగుకు సిద్ధమయ్యారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పనిముట్లు సమకూర్చుకోవాల్సిన కీలక సమయం ఇది. మార్కెట్‌లో విత్తనాలు, పురుగుమందుల ఉత్పత్తులకు సంబంధించిన ప్రకటనలతో ఆయా కంపెనీలు రైతులను ఊరిస్తున్నాయి. విత్తనం ఎంపికలో నకిలీది అయితే విత్తనం మొలకెత్తకపోవడం, ఎరువుల్లో తగిన నాణ్యత లేకపోయినా దిగుబడి రాకపోగా అప్పులే మిగులుతాయి.

రైతులు వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవడం ఉత్తమం. ఇప్పటికే గ్రామాల్లో పలు రకాల కంపెనీలు విత్తనాలు, పురుగు మందుల ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ప్రైవేట్ కంపెనీల ప్రకటనలు, ప్రచార ఆర్భాటాలతో రైతులను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఆయా గ్రామాలకు సంబంధించిన క్లస్టర్లలో వ్యవసాయ విస్తరణ అధికారులు అందుబాటులో ఉంటున్నారు. వారిని సంప్రదించి సలహాలు సూచనలు తీసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

ఎంటీయూ 1262 రకంతో మోసపోయి...

రెండేళ్ల క్రితం 25 కిలోల వరి ధాన్యం బస్తా ఖరీదు రూ.1050 ఉండగా ప్రస్తుతం రూ.1250 ఉంది. వీటితో పాటు, యూరియా, డీఏపీ, 20:20, 14:35, పురుగుమందుల ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. దీంతో విత్తనాలు, పురుగుమందులకే రూ.వేలను రైతులు వెచ్చించాల్సి వస్తోంది. గత ఏడాది మండలంలో కొంతమంది రైతులు ఎంటీయూ 1262 రకం సాగు చేసి తీవ్రంగా నష్టపోయారు. 160 రోజులకు రావాల్సిన పంట కేవలం 90 రోజులకే రావడంతో దిగుబడిపై గణనీయంగా ప్రభావం పడింది. విత్తనాలతో మోసపోయినట్లు రైతులు గుర్తించారు.


నియోజకవర్గంలో పంటల సాగు ఇలా..

నియోజకవర్గంలో పత్తి, వరి, మిర్చి పంటలు ఈ ఏడాది ఎక్కువ మొత్తంలో సాగయ్యే అవకాశం ఉంది. ఈసారి మిర్చి సాగు కాస్తా తగ్గి ఆయిల్‌పాం సాగు పెరిగే అవకాశం ఉన్నట్లు వ్యవసాయాధికారులు భావిస్తున్నారు. నియోజకవర్గంలో ప్రధానంగా వరి 13,500 ఎకరాలు, మొక్కజొన్న 2,500 ఎకరాలు, పత్తి 44 వేల ఎకరాలు, మిర్చి రూ.8 వేల ఎకరాలు, ఆయిల్‌పాం 1500 ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

రశీదులు తీసుకోవాలి...

గుర్తింపు పొందిన దుకాణాల్లోనే రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన వాటికి తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలి. అధిక ధరలకు నకిలీ విత్తనాలు, పురుగు మందులను కొనుగోలు చేసి మోసపోవద్దు.


చాలా నష్టపోయాను...



గతేడాది ఆరు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి పంట సాగు చేశాను. అంతకుముందు సంవత్సరం ఇదే రకం పంటను సాగు చేస్తే మంచి దిగుబడి వచ్చిందని మళ్లీ అదే రకాన్ని సాగు చేశాను. 160 రోజులకు రావాల్సిన పంట కేవలం 90 రోజులకే వచ్చి దిగుబడి తగ్గి చాలా నష్టం వాటిల్లింది.

– షేక్ మహబూబ్ అలీ రైతు, సుజాతనగర్

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు..



నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. లైసెన్స్ రద్దు చేసి షాపులను సీజ్ చేస్తాం. ప్రభుత్వ గుర్తింపు పొందిన కంపెనీల విత్తనాలు మాత్రమే విక్రయించాలి. విత్తన పాకెట్లు, పురుగుమందు డబ్బాలపై తయారీ, గడువు తేదీ తప్పనిసరిగా ఉండాలి.

– ఉల్లోజు నరసింహారావు, ఏడీఏ కొత్తగూడెం

జాతీయ రహదారిపై పశువుల తిష్ట


గోధుమవాగు బ్రిడ్జి వద్ద రోడ్డుపై సంచరిస్తున్న పశువులు

సింగరేణి(కొత్తగూడెం): విజయవాడ – ఛత్తీస్‌గఢ్ జాతీయ రహదారి, మార్గమధ్యలోని కొత్తగూడెం – రామవరం అనుసంధానం అయ్యే గోధుమవాగు రోడ్డుపై తిష్ట వేయగా, మరికొన్ని పశువులు రోడ్డుపై సంచరిస్తున్నాయి. దీంతో వాహనదారులు నానా ఇబ్బందులకు పడుతున్నారు. అవి ఏ సమయంలో వాహనాల రాకపోకలకు బెదిరి ఎటువైపు పరుగులు తీస్తాయో అర్థం కాని పరిస్థితి. కొన్ని సమయాల్లో వాహనాలపై పడి ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఈ రహదారిపై కొంతమంది జిల్లా స్థాయి అధికారులు కూడా వాహనాల్లో రాకపోకలు చేస్తుంటారు.

చూస్తున్నారే తప్ప.. ఎటువంటి చర్యలు చేపట్టటం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా, వాహనదారులు వీటివలన ఇబ్బందులు పడుతున్నప్పటికీ మున్సిపల్ అధికారుల్లో చలనం లేదని పట్టణ ప్రజలు వాపోతున్నారు. అంతేకాకుండా ఈ రోడ్డు రుద్రంపూర్ – ప్రగతివనం వరకు నిత్యం పశువుల ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు కానీ, ప్రజా ప్రతినిధులు కానీ చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తారు.

ఆ తరువాత వాటిని మర్చిపోతారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా రోడ్డుపై అడ్డంగా పశువులు పడుకున్న సమయంలో రాత్రివేళల్లో వచ్చే వాహనాల వల్ల ప్రమాదాలు జరిగినా వాటి యజమానులు పట్టించుకోవడం లేదని, వాటిని బందెల దొడ్డికి పంపించాలంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై పశువుల సంచారం లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.